ఓటే వజ్రాయుధం




ప్రజాస్వామ్యం మనుగడకు ఓటు వజ్రాయుధం వంటిదని, ఓటు వినియోగించుకోవడం మనందరి బాధ్యత. ఆకివీడు జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం ఓటు వినియోగించుకున్నా. ప్రజాస్వామ్యంలో మంచి వ్యక్తులకు ఓటువేసి గెలిపించుకుకోవాలి.

- రఘురామ కృష్ణరాజు
డిప్యూటీ స్పీకర్




ఓటు వేసిన కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ





మంత్రి నిమ్మల



ఓటు వేసిన మోషేన్‌రాజు

తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి దంపతులు



ఉమ్మడి తూర్పులో ఓట్లు వేస్తున్న అభ్యర్థులు ఐ.పోలవరంలో రాజశేఖరం, కపిలేశ్వరపురంలో వీరరాఘవులు



వీరవాసరంలో పోలింగ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగరాణి, ఆర్డీవో ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

ఎమ్మెల్సీ పోలింగ్

69.50%

ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఎలాంటి వివాదాలకు తావు లేకుండా జరిగింది. గోదావరి జిల్లాల్లో ఏ ఎన్నికలు వచ్చినా హడావుడే కనిపిస్తుంది. కాని, ప్రచారంలో కనిపించినంత వేగం పోలింగ్ కేంద్రాలకు వచ్చేసరికి చప్పబడింది. 456 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ జరిగింది. మొత్తం 3,14,984 మంది ఓటర్లకు 2,18,902 మంది ఓట్లు వేశారు. పోలింగ్ శాతం 69.50గా నమోదైంది.

- మందకొడిగా మొదలు..
- పట్టభద్రుల్లో కానరాని ఉత్సాహం
- మధ్యాహ్నానికి తేరుకున్న కూటమి కేడర్
- అప్పటికప్పుడు ఓటర్లను రప్పించిన నేతలు
- ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధుల పర్యవేక్షణ
- రాజశేఖరం, వీరరాఘవుల మధ్యేపోటీ

(భీమవరం/ఏలూరు-ఆంధ్రజ్యోతి)

సాధారణ ఎన్నికల మాదిరే ఈ ఎన్నికల్లో ఓటర్లు తొలి రెండు గంటల్లోనే ఓటు హక్కు వినియోగించుకుంటారని అధికారులు భావించారు. దీనికి భిన్నంగా ఓటర్లలో అలాంటి ఉత్సాహం కనిపించలేదు. ఉదయం నుంచి పోలింగ్ మందకొడిగా ప్రారంభమైంది. తొలి రెండు గంటల్లో కేవలం 5.77 శాతం మాత్రమే ఓట్లు పోలయ్యాయి. ఆరంభంలోనే అనేక పోలింగ్ కేంద్రాలు ఓటర్లు లేక వెలవెలబోయాయి. ఉదయం 11 గంటల తర్వాత క్రమేపీ పోలింగ్ కేంద్రాలకు ఓటర్లు రావడం ఆరంభమైంది. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లోని వివిధ పోలింగ్ కేంద్రాల్లో ఇదే వాతావరణం కనిపించింది. తొలి నాలుగు గంటల్లోనే కేవలం 20 శాతమే నమోదైంది. పోలింగ్ శాతం అతి తక్కువగా ఉండడంతో టీడీపీ వర్గాలు మధ్యాహ్నానికి అప్రమత్తమయ్యాయి. సిట్టింగ్ ఎమ్మెల్యేలు పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. స్వేచ్ఛగా ఓటు వేయడంటూ పట్టభద్రులకు విజ్ఞప్తి చేశారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ శాతం పెరిగేలా ఎమ్మెల్యేలంతా తమ వంతు పాత్ర పోషించారు. అతి తక్కువ ఓటర్లున్న అల్లూరి సీతారామరాజు జిల్లా పోలింగ్ శాతంలో ముందు వరుసలో నిలిచింది. 4,669 మంది ఓటర్లకు 3,637 మంది ఓటు హక్కు వినియోగించుకోగా 77.90 శాతం మేర పోలింగ్ నమోదైంది. ఈ జిల్లాలో పోలింగ్ స్టేషన్ల సంఖ్య అత్యల్పమే. ఏలూరు జిల్లాలో 42,282 మంది ఓటర్లు ఉండగా, వీరిలో 29,651 మంది ఓటు హక్కును వినియో గించుకున్నారు. జిల్లా కేంద్రం ఏలూరులో అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు పలుచగానే కనిపించారు. నిర్దీత సమయానికి ముందుగానే పోలింగ్ కేంద్రాలు ఖాళీ అయ్యాయి.

పశ్చిమలో 69.80 శాతం

పశ్చిమ గోదావరి జిల్లాలోని 93 పోలింగ్ కేంద్రాల్లో ఉదయం ఎనిమిది గంటల నుంచి పట్టభద్రులు ఓటు వేసేందుకు తరలివచ్చారు. తొలుత మందకొడిగా ప్రారంభమైనప్పటికి ఓటింగ్ పది గంటలకు ఊపందుకుంది. జిల్లాలో 70,052 మంది పటభద్రుల ఓటర్లుకు గాను 48,893 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. వీరిలో పురుషులు 27,960, మహిళలు 20,933 మంది ఉన్నారు. పోలింగ్ 69.80 శాతంగా నమోదైంది. పాలకొల్లు నియోజకవర్గంలో అత్యధిక శాతం ఓటింగ్ నమోదైంది. పాలకొల్లు, యలమంచిలిలో సగటున 72 శాతం మంది పట్టభద్రులు ఓటింగ్‌లో పాల్గొన్నారు. పెంటపాడు మండలం 344 పోలింగ్ కేంద్రంలో 78 శాతం ఓటింగ్ నమోదైంది. అక్కడ 606 మంది ఓటర్లు ఉంటే 447 మంది ఓటు వేశారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి కూటమి నేతలు ఖర్చులు భరించారు. పాలకొల్లు వంటి నియోజకవర్గాల్లోనే దూరప్రాంతాల నుంచి ఓటర్లను రప్పించారు.

పోలింగ్ ఆసాంతం పోటా పోటీ

పోలింగ్ మందకొడిగా సాగినా.. తెలుగుదేశం అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్, పీడీఎఫ్ అభ్యర్థి దిడ్ల వీరరాఘవులు మధ్య పోటీ హోరాహోరీగా సాగినట్లే కనిపించింది. పోలింగ్ కేంద్రాల వద్ద తెలుగుదేశం, పీడీఎఫ్ అనుకూలురు ఎక్కడికక్కడ గుమిగూడి ప్రచారం చేశారు. టీడీపీ పక్షాన ఓటర్లకు ఎరవేసేందుకు ప్రయత్నించారంటూ పీడీఎఫ్ అభ్యర్థి మద్దతుదారులు ఆరోపణలు చేశారు. ఎన్నికల నిబంధనలకు పాతరేసి డబ్బులు పంపిణీ చేస్తూ అక్రమాలకు పాల్పడ్డారని సీఐటీయూ ఏలూరు జిల్లా అధ్యక్షుడు లింగరాజు, ప్రధాన కార్యదర్శి ప్రసాద్ ఆరోపించారు. ఎన్నికల శిబిరాల పేరుతో జాతరలా నిర్వహించారని, దొంగ ఓట్లు వేసేందుకు బరి తెగించారంటూ టీడీపీపై ఆరోపణలు చేశారు. జరిగిన అక్రమాలపై ఎన్నికల అధికారులు స్పందించాలని డిమాండ్ చేశారు.

ఓటర్ల స్లిప్పులు ఎక్కడ ?

అధికార యంత్రాంగం గ్రాడ్యుయేట్ ఓటర్ల ఓటర్ల స్లిప్పుల పంపిణీ సక్రమంగా చేయలేకపోయింది. దీంతో ఓటర్ల స్లిప్పుల కోసం పడిగాపులు, ఎదురుచూపులు తప్పలేదు. సాధారణ ఎన్నికలకు భిన్నంగా పోలింగ్ కేంద్రాలు కొంత దూరంగా ఉండడంతో ఓటర్ స్లిప్పుల కోసం హైరానా పడ్డారు. పోలింగ్ కేంద్రాల వద్ద టీడీపీ, పీడీఎఫ్ నేతలు ఏర్పాటు చేసిన టెంట్ల వద్ద ఓటర్ స్లిప్పులను తీసుకుని వేశారు. కొంత మంది ఎన్నికల సంఘం ఇచ్చిన వాట్సాప్ నెంబర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని వచ్చి ఓట్లేశారు.

కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

జిల్లా కలెక్టర్ నాగరాణి భీమవరం, వీరవాసరంలోని పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. ఓటర్లతో మాట్లాడి పోలింగ్ తీరుతెన్నులు, ఇబ్బందులపై ఆరా తీశారు. ఆమె మాట్లాడుతూ 93 పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలింగ్ ప్రశాంతంగా సాగిందన్నారు. పోలింగ్ ప్రక్రియను కలెక్టరేట్ నుంచి వెబ్ కాస్టింగ్ ద్వారా పరిశీలించినట్లు తెలిపారు. పోలింగ్ పూర్తయిన తర్వాత్ బ్యాలెట్ బాక్సులను భీమవరం కలెక్టరేట్‌కు, ఆపై ప్రత్యేక వాహనంలో ఏలూరులోని స్ట్రాంగ్ రూముకు తరలిస్తామన్నారు. ఎక్కడా అవాంఛనీయ ఘట నలు జరగకుండా జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం ఆస్మి పర్యవేక్షణలో బందోబస్తు నిర్వహించారు.



భీమవరం చింతలపాటి బాపిరాజు పాఠశాల వద్ద ఎస్పీ, పోలీసు సిబ్బంది పర్యవేక్షణ

జిల్లా	పోలింగ్ కేంద్రాలు	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	శాతం
1. ఏలూరు	66	42,282	29,651	70.13
2. పశ్చిమ గోదావరి	93	70,052	48,893	69.80
3. తూర్పుగోదావరి	92	62,970	42,446	67.41
4. కాకినాడ	98	70,540	47,150	66.84
5. డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ	95	64,471	47,125	73.09
6. అల్లూరి సీతారామరాజు	12	4,669	3,637	77.90
మొత్తం	456	3,14,984	2,18,902	69.50



తణుకులో విజయకేతనం చూపిస్తున్న జిల్లా అధ్యక్షుడు రామరాజు



ఆచంటలో ఓటింగ్ సరళిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పితాని



టీపీగూడెం పోలింగ్ కేంద్రం సమీపంలో ఎమ్మెల్యే బొలిశెట్టి



నరసాపురంలో ఓటింగ్‌ను పరిశీలిస్తున్న విప్ నాయకర్



గణపవరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు

ఓట్లు వేసిన ప్రముఖులు

పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల్లో ఓటు వేసిన ప్రముఖుల్లో భీమవరంలో కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, పాలకొల్లులో మంత్రి నిమ్మల రామానాయుడు, భీమవరంలో శాసనమండలి చైర్మన్ మోషేన్‌రాజు, ఆకివీడులో డిప్యూటీ స్పీకర్ రఘు రామకృష్ణరాజు, తణుకులో ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బి. గోపీమూర్తి, ఏలూరులో ఎమ్మెల్యే బడేటి చంటి, పోలవరంలో బాలరాజు, చింతల పూడిలో సొంగా రోషన్‌కుమార్, తదితర ప్రముఖులు ఓటును వినియోగించుకున్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ప్రభుకుమార్, అరెస్టైన నిందితులు

మద్యం గుట్టు రట్టు

- కొప్పర్రు మద్యం కేసులో నలుగురి అరెస్టు
- 4,125 మద్యం సీసాలు స్వాధీనం
- యానాం నుంచి మద్యం దిగుమతి.. వాటిపై గోవా స్టిక్కర్లు

నరసాపురం రూరల్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): కొప్పర్రు చేపల చెరువులో పట్టుబడ్డ నాన్ డ్యూటీ పెయిడ్ కేసులో గురువారం ఎక్సైజ్ పోలీసులు నలుగురిని అరెస్టు చేశారు. 4,125 మద్యం సీసాలు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. మునిసిపల్ వైసీపీ కౌన్సిలర్ బర్రె జయరాజుతో పాటు దిడ్ల రామకృష్ణ, గొల్లమందల రాజబాబు, కత్తిమండ జయబాబులను అరెస్టు చేశారు. మరో నిందితుడు కోనాల భరత్‌రెడ్డి పరారీలో ఉన్నాడు. యానం నుంచి సరుకు ఇతనే సరఫరా చేసినట్టు ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ ప్రభుకుమార్ తెలిపారు. ఎక్సైజ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈఏడాది జనవరిలో వైసీపీ కౌన్సిలర్ జయరాజు కోనాల భరత్‌రెడ్డి ద్వారా వంద మద్యం కేసులను యానాం నుంచి రప్పించుకున్నాడు. వాటిలో 14 కేసుల మద్యాన్ని పండుగ సమయంలోనే అమ్మేశారన్నారు. మిగిలిన 86 మద్యం కేసుల్ని కొప్పర్రు చెరువులో భద్రపర్చారన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మద్యం షాపులు మూసివేయడంతో వాటిని బయటకు విక్రయించేందుకు జయరాజు ప్రయత్నించారన్నారు. ఈసమాచారం తెలుసుకుని సీఐ రాంబాబు దాడి చేయగా అక్రమ మద్యం నిల్వలు బయటపడ్డాయన్నారు. స్వాధీనం చేసుకున్న బాటిళ్లపై గోవా లేబుల్స్ ఉన్నాయని, నెట్‌లో వాటిని పరిశీలిస్తే ఆ కంపెనీ గోవాలో లేదని, కనీసం తయారు చేసిన తేదీ కూడా లేదన్నారు. భరత్‌రెడ్డిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను యానం పంపామన్నారు. అరెస్టు చేసిన జయరాజుకు యానంలోని భరత్‌రెడ్డికి ఆర్థిక లావాదేవీలు జరిగినట్టు విచారణలో తేలిందన్నారు. భరత్‌రెడ్డి పట్టుబడితే జిల్లాలో ఇంకా ఎవరికైనా సరఫరా చేస్తున్నాడా అనే విషయాలు తెలుస్తాయన్నారు. అరెస్టు చేసిన నలుగురిని కోర్టుకు హాజరుపరుస్తామన్నారు.



సోమేశ్వర స్వామి రథోత్సవం

భీమవరం గునుపూడి సోమేశ్వరస్వామి రథోత్సవం గురువారం శోభాయమానంగా సాగింది. పార్వతీ పరమేశ్వరులకు కల్యాణం అనంతరం భక్తులు మొక్కులుగా కట్టిన అరటి పండ్ల గెలలతో అందంగా తయారు చేసిన రథంపై కిక్కిరిసిన భక్తుల మధ్య రథోత్సవం సాగింది.

7

రేపటి నుంచే ఇంటర్ పరీక్షలు

జిల్లాలో 52 పరీక్షా కేంద్రాలు

భీమవరం రూరల్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియెట్ పరీక్షలు శనివారం నుంచి మొదలుకానున్నాయి. జిల్లాలో 52 పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాల నిఘా మధ్య పరీక్షలు నిర్వహించనున్నారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం 19,708 విద్యార్థులు, ద్వితీయ సంవత్సరం 18,123 మంది మొత్తం 37,831 విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని జిల్లా ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ ఎ.నాగేశ్వరరావు తెలిపారు. జిల్లాలోని 52 పరీక్షా కేంద్రాలలో 900 మంది వరకు ఇన్విజిలేటర్లు ఉంటారు. చీఫ్ సూపరింటెండెంట్‌గా 52 మంది డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు 52 మంది వ్యవహరిస్తారు. అడిషనల్ డిపార్ట్‌మెంట్ ఆఫీసర్‌లుగా 12 మందితోపాటు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు-3, సిట్టింగ్ స్క్వాడ్‌లు 3 ఉంటాయి. కస్టోడియన్స్‌గా 15 మంది అధికారులను ఏర్పాటు చేశారు.

మార్చి 1 నుంచి 20 వరకు పరీక్షలు

ఇంటర్ ప్రథమ సంవత్సరం సెకండ్ లాంగ్వేజ్ పేపర్-1 పరీక్ష మార్చి ఒకటో తేదీన జరుగుతుంది. 3వ తేదీన ద్వితీయ సంవత్సరం సెకండ్ లాంగ్వేజ్ పేపర్-2, నిర్వహిస్తుంటే 4న ప్రథమ సంవత్సరం ఇంగ్లిష్ పేపర్ -1, 5న ద్వితీయ సంవత్సరం ఇంగ్లిష్ పేపర్ -2 జరుగుతుంది. 6న ఫస్టియర్ మ్యాథ్స్ పేపర్ -1ఏ, బోటనీ పేపర్-1, సివిక్స్ పేపర్ 1 జరుగుతుంది. 7న సెకండియర్ మ్యాథ్స్ పేపర్ -2ఏ, బోటనీ పేపర్-2, సివిక్స్ పేపర్-2 నిర్వహిస్తారు. 8న ఫస్టియర్ మ్యాథ్స్ పేపర్ -1బి, జువాలజీ పేపర్-1, కెమిస్ట్రీ పేపర్-1, 10న సెకండియర్ మ్యాథ్స్ పేపర్ -2బి, జువాలజీ పేపర్-2, కెమిస్ట్రీ పేపర్-2 జరుగును. 11న ఫస్టియర్ ఫిజిక్స్ పేపర్ -1, ఎకనామిక్స్ పేపర్-1 నిర్వహిస్తారు. 12న సెకండియర్ ఫిజిక్స్ పేపర్ -2, ఎకనామిక్స్ పేపర్ -2. 13న ఫస్టియర్ కెమిస్ట్రీ పేపర్ -1, కామర్స్ పేపర్-1, సోషియాలజీ పేపర్-1, ఫైన్ ఆర్ట్స్ -1, మ్యూజిక్ పేపర్-1. 15న సెకండియర్ కెమిస్ట్రీ పేపర్-2, కామర్స్ పేపర్-2, సోషియాలజీ పేపర్-2, ఫైన్ ఆర్ట్స్, మ్యూజిక్ పేపర్ -2 నిర్వహిస్తారు. 17న ఫస్టియర్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పేపర్-1, లాజిక్ పేపర్-1, బ్రిడ్జి కోర్సు మ్యాథమెటిక్స్ పేపర్-1 నిర్వహిస్తారు. 18న సెకండియర్ పబ్లిక్ అడ్మిస్ట్రేషన్ పేపర్-2, లాజిక్ పేపర్-2, బ్రిడ్జి కోర్సు మ్యాథ్‌మెటిక్స్ పేపర్-2. 19న ఫస్టియర్ మోడ్రన్ లాంగ్వేజ్ పేపర్ -1, జియోగ్రఫీ పేపర్ -1 నిర్వహిస్తారు. 20న ద్వితీయ సంవత్సరానికి మోడ్రన్ లాంగ్వేజ్ పేపర్-2, జియోగ్రఫీ పేపర్-2 జరుగుతాయి.

ఇచ్చిపుచ్చుకోండి!

(మొదటి పేజీ తరువాయి)

కేఆర్ఎంబీ త్రిసభ్య కమిటీ నెలకోసారి సమావేశమై.. పరిస్థితిని సమీక్షించుకుందాం' అని జైన్ ఈ సందర్భంగా సలహా ఇచ్చారు. వరద సమయంలోనూ పోతిరెడ్డిపాడు నుంచి నీటిని ఏపీ వాడుకుందని.. కేసీ కెనాల్ ద్వారా కూడా నీటిని వాడుకుందని గతంలో చేసిన ఆరోపణలనే తెలంగాణ ప్రస్తావించింది. నాగార్జున సాగర్ నుంచీ వాడేసుకుందని తెలిపింది. ఈ వాదనలను ఏపీ తీవ్రంగా ఖండించింది. వరద నీరు సముద్రంలోకి వెళ్తుంటే రాష్ట్రావసరాలకు వాడుకున్నామని పునరుద్ఘాటించింది. పోతిరెడ్డిపాడు నుంచి నీటిని తీసుకున్నా.. ఆ తర్వాత పై నుంచి వచ్చిన వరద కారణంగా శ్రీశైలం జలాశయం నిండినందున.. 20 టీఎంసీల నష్టం వాటిల్లిందన్న వాదనలోనూ పస లేదంది. శ్రీశైలం, సాగర్‌లలో విద్యుదుత్పత్తి ద్వారా దిగువకు నీటిని వదిలి సముద్రంపాలు చేసింది తెలంగాణేనని ఆక్షేపించింది. దీంతో చైర్మన్ జోక్యం చేసుకుని.. గతంలో జరిగినవి ఇప్పుడు అప్రస్తుతమన్నారు. ప్రస్తుతం సాగర్ కుడి ప్రధాన కాలువ నుంచి ఏపీకి వదులుతున్న ఏడు వేల క్యూసెక్కులు.. తెలంగాణ కోసం వదులుతున్న తొమ్మిది టీఎంసీలు.. పంటలను కాపాడుకోవడానికి సరిపోతాయో లేదో ఈఎన్‌సీల స్థాయిలో చర్చించుకోవాలన్నారు. ఉన్న నీటిని పంటలకు సర్దుకోవడం.. తాగునీటి అవసరాలు తీర్చుకోవడంపై దృష్టి సారించాలని, ఎలిమినేటి మాధవరెడ్డి కాలువ, హంద్రీ-నీవా నీటినీ సమీక్షించుకోవాలని సూచించారు. నెల తర్వాత కార్యదర్శుల స్థాయిలో మాట్లాడుకుని.. అవసరాలకు అనుగుణంగా సాగర్‌లో అందుబాటులో ఉన్న జలాలను ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో వాడుకోవాలని సూచించారు. రెండు రాష్ట్రాల సీఈల కమిటీ జూన్ వరకు ఏపీకి 55, తెలంగాణకు 63 టీఎంసీలు అవసరమంటూ ఇచ్చిన నివేదికపైనా చర్చించారు. అనంతరం చైర్మన్ సూచన మేరకు ఈఎన్‌సీలు వెంకటేశ్వరరావు, అనిల్‌కుమార్ సమావేశమై సుహృద్భావ వాతావరణంలో చర్చించుకున్నారు. పంటల రక్షణకు సాగర్ కుడి కాలువ నుంచి 7 వేల నుంచి 8 వేల క్యూసెక్కులు.. ఎడమ కాలువ నుంచి 7 వేల క్యూసెక్కులను వాడుకోవాలని నిర్ణయించారు. శ్రీశైలం జలాల వాడకంలో తాగునీటి అవసరాలకు ప్రాధాన్యమిచ్చేందుకు అంగీకరించారు.



సీలేరు జలవిద్యుత్ కేంద్రం

100 రోజులు.. 1,596 మి. యూనిట్లు

- రికార్డు స్థాయిలో కృష్ణపట్నం మూడో యూనిట్ ఉత్పత్తి
- ఒక్కరోజే 4.949 మిలియన్ యూనిట్లు
- అద్భుతం సృష్టించిన సీలేరు జల కేంద్రం

అమరావతి, సీలేరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): జెన్కో విద్యుదుత్పత్తి సంస్థలు రికార్డు స్థాయిలో విద్యుత్తు ఉత్పత్తి చేస్తున్నాయి. కృష్ణపట్నం దామోదరం సంజీవయ్య థర్మల్ విద్యుత్కేంద్రం మూడో యూనిట్‌లో వంద రోజులుగా నిరంతరాయంగా విద్యుదుత్పత్తి జరుగుతూ 1596.30 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తిని సాధించింది. ఇక.. సీలేరు జల విద్యుత్ కేంద్రం 24 గంటల వ్యవధిలోనే రికార్డుస్థాయిలో 4.949 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి చేసింది. ఇది ఈ కేంద్రం చరిత్రలోనే ఆల్ టైమ్ రికార్డు. ఆ వివరాలను జెన్కో గురువారం వెల్లడించింది. వేసవిలో విద్యుత్తు కొరత రానీయకుండా ప్రణాళికలు అమలు చేస్తున్నామని జెన్కో ఎండీ కేవీఎన్ చక్రధరబాబు వెల్లడించారు. జెన్కో విద్యుత్తు కేంద్రాలు 2025 జనవరి నుంచి ఇప్పటిదాకా సగటున 110 మిలియన్ యూనిట్లను ఉత్పత్తి చేస్తున్నాయని చెప్పారు. ఈ నెల 22వ తేదీన 123 మిలియన్ యూనిట్లను ఉత్పత్తి చేశామన్నారు. నార్ల తాతారావు థర్మల్ విద్యుత్కేంద్రం నుంచి తొలిసారిగా 95 మిలియన్ యూనిట్లను ఈ నెల 18న ఉత్పత్తి చేశామని తెలిపారు.

నెలరోజుల ముందుగానే లక్ష్యఛేదన

సీలేరు జల విద్యుత్ కేంద్రం ఉత్పత్తిలో లక్ష్యాన్ని అధిగమించిందని జెన్కో ఈఈ వి.రాజేంద్రప్రసాద్ తెలిపారు. సీలేరు జల విద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తి లక్ష్యం 477 మిలియన్ యూనిట్లకు గాను గురువారం (27వ తేదీ) ఉదయం నాటికి 477.644 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేసి లక్ష్యాన్ని అధిగమించామని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా సీలేరు జల విద్యుత్ కేంద్రం ఇంజనీర్లను, సిబ్బందిని సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావు, ఎస్ఈలు (ఓ అండ్ ఎం) చిన్న కామేశ్వరరావు, చంద్రశేఖర్‌రెడ్డి అభినందించారు.

కరెంటు కొనుగోలు బకాయి 6,556 కోట్లు

అమరావతి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): విద్యుత్తు కొనుగోలు బకాయిలు రూ.6,556.25 కోట్లకు చేరుకున్నాయి. ఇందులో గత నెల బకాయిలు రూ.1,873. కోట్లు దానికిముందు రెండు నెలల బకాయిలు రూ.4,653.24 కోట్లు. ఈ విషయం కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ 'ప్రాప్తి' పోర్టల్ వెల్లడించింది. తక్షణమే ఈ బకాయిలు చెల్లించాలని ఏపీపీసీసీని కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ కోరింది.

డిస్కమ్‌ల బలోపేతానికి సహకారం అందించండి


- సీమలో గ్రీన్ ఎనర్జీ కారిడార్ ఏర్పాటు చేయండి
- కేంద్ర మంత్రి ఖట్టర్‌ను కోరిన మంత్రి గొట్టిపాటి రవికుమార్

అమరావతి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): డిస్కమ్‌లను ఆర్థికంగా బలోపేతం చేయాలంటే కేంద్ర ప్రభుత్వ సహకారం నిరంతరం కావాల్సిందేనని రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. కేంద్ర ఇంధన శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ గురువారం రాష్ట్రాల ఇంధన శాఖల కార్యదర్శులు, మంత్రులతో సమావేశమయ్యారు. పట్టభద్రుల కోటా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియలో బిజీగా ఉన్న గొట్టిపాటి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ సమావేశంలో పాల్గొన్నారు. పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టులను ప్రోత్సహిస్తున్నామని గొట్టిపాటి తెలిపారు. రాయలసీమలో సోలార్, పవన, పంప్డ్ స్టోరేజీ జల విద్యుత్ పథకాలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని, ఆ ప్రాంతంలో ఉత్పత్తి అయ్యే కరెంటును రాష్ట్ర గ్రిడ్‌కు అనుసంధానం చేసేలా గ్రీన్ కారిడార్‌ను ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రిని కోరారు. కేంద్ర సహకారాన్ని కోరగా, కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారు. త్వరలోనే మరోసారి సమావేశాన్ని నిర్వహిస్తామని, ఈ సమావేశంలో కార్యాచరణను ప్రకటిస్తామని ఖట్టర్ వెల్లడించారు.

చిత్రజ్యోతి

SINCE 1965

రెట్రోను అందిస్తున్న సితార



విభిన్న పాత్రలు, చిత్రాలతో ప్రేక్షకులను అలరిస్తున్న తమిళ హీరో సూర్య తాజా చిత్రం 'రెట్రో'. మే ఒకటిన విడుదలకు సిద్ధమవుతున్న ఈ చిత్రం తెలుగు రాష్ట్రాల థియేట్రికల్ రైట్స్‌ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ సొంతం చేసుకుంది. ఒకవైపు వరుసగా సినిమాలు నిర్మిస్తూ భారీ విజయాలను అందుకుంటున్న ఈ సంస్థ మరో వైపు పంపిణీరంగంలోనూ తనదైన ముద్ర వేస్తోంది. సూర్య తెలుగు అభిమానులు థియేటర్లలో పండగ చేసుకొనేలా 'రెట్రో' విడుదలకు ఈ సంస్థ ప్లాన్ చేస్తోంది. కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వం వహిస్తున్న 'రెట్రో'లో పూజా హెగ్డే కథానాయిక. సూర్య, జ్యోతిక నేతృత్వంలో 2డి ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ ఈ సినిమాను నిర్మిస్తోంది. జోజు జార్జ్, జయరామ్, నాజర్, ప్రకాశ్‌రాజ్ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. షూటింగ్ పార్ట్ పూర్తి చేసుకున్న 'రెట్రో' చిత్రానికి సంబంధించి ఇప్పుడు నిర్మాణానంతర కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి.

జూన్‌లో వస్తున్న కుబేరుడు



ధనుష్, నాగార్జున, రష్మిక మందన్న ప్రధాన పాత్రల్లో శేఖర్ కమ్ముల దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'కుబేర'. ఈ ఏడాది జూన్ 20న తెలుగుతో పాటు తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదలవుతోంది. ఈ మేరకు రిలీజ్ డేట్ పోస్టర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. పోస్టర్‌లో నాగార్జున, ధనుష్ ఎదురెదురుగా నిలబడి ఒకరిని మరొకరు తీక్షణంగా చూస్తుండటం ఆసక్తిని కలిగిస్తోంది. సినిమాలోని నాలుగు ప్రధాన పాత్రలను పరిచయం చేస్తూ ఇప్పటికే విడుదల చేసిన ఫస్ట్ గ్లింప్స్ ప్రేక్షకుల్లో అంచనాలను పెంచింది.

విష్ణు నమ్మకమే శివుడి పాత్ర చేయించింది

-అక్షయ్ కుమార్



'శివుడి పాత్ర చేయాలంటూ ఆఫర్ వచ్చినప్పుడు నేను రెండు సార్లు తిరస్కరించాను. కానీ విష్ణు వదల్లేదు. భారతీయ సినీ ప్రపంచంలో శివుడిగా నేను బాగుంటాను' అని విష్ణు పెట్టుకున్న నమ్మకమే నాతో ఆ పాత్ర చేయించింది. కన్నప్ప కథ చాలా శక్తిమంతమైంది. విజువల్ వండర్‌గా ఉంటుంది. ఈ అద్భుతమైన ప్రయాణంలో నేనూ భాగమవడం గౌరవంగా భావిస్తున్నాను' అన్నారు బాలీవుడ్ నటుడు అక్షయ్ కుమార్. డాక్టర్ మోహన్‌బాబు తన తనయుడు విష్ణు మంచుతో ముఖేశ్‌కుమార్ సింగ్ దర్శకత్వంలో నిర్మించిన 'కన్నప్ప' టీజర్‌ను ముంబైలో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అక్షయ్‌కుమార్ మాట్లాడారు. హీరో విష్ణు మాట్లాడుతూ 'కన్నప్ప కేవలం నాకు ఓ సినిమా కాదు.. నా జీవన ప్రయాణం. కన్నప్ప కథతో నాకు ఆధ్యాత్మిక బంధం ఏర్పడింది. ఈ ప్రయాణంలో అక్షయ్‌కుమార్, మోహన్‌లాల్, ప్రభాస్ వంటి దిగ్గజాలు మాతో చేరడం ఆనందంగా ఉంది. ఇప్పటికే కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో అందరి దృష్టినీ ఆకట్టుకొన్న టీజర్‌ను మార్చి ఒకటిన విడుదల చేస్తున్నాం. ఏప్రిల్ 25న 'కన్నప్ప' విడుదలవుతుంది' అని చెప్పారు.



పూజా హెగ్డే ప్రత్యేక గీతం

సూపర్‌స్టార్ రజనీకాంత్ హీరోగా లోకేష్ కనకరాజ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'కూలీ' చిత్రంలో పూజా హెగ్డే నటిస్తున్నారు. ఆమె లుక్‌ను చిత్రబృందం గురువారం విడుదల చేసింది. బుధవారం 'ఈ స్టార్ హీరోయిన్ ఎవరో గుర్తుపట్టండి' అంటూ ఓ ప్రీలుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. తాజాగా ఆ పోస్టర్ పూజా హెగ్డేదేనంటూ ప్రకటించింది. అయితే, ఈ మూవీలో పూజా హెగ్డే కీలక పాత్రను పోషిస్తున్నారా? లేక స్పెషల్ సాంగ్‌లో నర్తిస్తున్నారా? అనేది తెలియాల్సివుంది. 'జైలర్' సినిమాలో హీరోయిన్ తమన్నా 'కావాలయ్యా' పాట తరహాలో సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ ఓ ప్రత్యేక గీతాన్ని ప్లాన్ చేసినట్టు తెలుస్తోంది. ఈ గీతంలో నర్తించేందుకు పూజా హెగ్డేను ఎంపిక చేసినట్టు అభిమానులు భావిస్తున్నారు. ఈ మూవీలో ఆమీర్ ఖాన్, నాగార్జున, ఉపేంద్ర, సత్యరాజ్, శ్రుతిహాసన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు.

-చెన్నై, ఆంధ్రజ్యోతి

ఇది పైసా వసూల్ సినిమా

- సందీప్ కిషన్



'మజాకా' చిత్రాన్ని ఆదరిస్తున్న ప్రేక్షకులందరికీ ధన్యవాదాలు. ఇది పైసా వసూల్ సినిమా. అందరూ థియేటర్లలోనే చూడండి' అని హీరో సందీప్ కిషన్ కోరారు. ఆయన కథానాయకుడిగా నక్కిన త్రినాథరావు దర్శకత్వం వహించిన 'మజాకా' చిత్రం సక్సెస్‌మీట్‌ను యూనిట్ గురువారం నిర్వహించింది. ఈ సందర్భంగా సందీప్‌కిషన్ మాట్లాడుతూ 'ప్రేక్షకులు సినిమాను ఎంజాయ్ చేస్తున్నారు' అని అన్నారు. త్రినాథరావు మాట్లాడుతూ 'ప్రేక్షకుల స్పందన చూస్తుంటే మేం సక్సెస్ అయ్యాం అనిపించింది' అని తెలిపారు.

ఆస్ట్రేలియాలో షూట్ చేశాం

- విరాజ్ రెడ్డి



విరాజ్‌రెడ్డి చీలం కథానాయకుడిగా పరిచయమవుతున్న చిత్రం 'గార్డ్'. జగ పెద్ది దర్శకత్వంలో అనసూయ రెడ్డి నిర్మించారు. నేడు ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సందర్భంగా విరాజ్‌రెడ్డి మాట్లాడుతూ "ఈ చిత్రం షూటింగ్ అంతా ఆస్ట్రేలియాలో చేశాం. ఒక సెక్యూరిటీ గార్డ్ జీవితంలో జరిగిన సంఘటనల సమాహారంగా సినిమా ఉండబోతోంది. కథానుసారం అన్ని రకాల ఎమోషన్స్ పలికించడం నటుడిగా నాకు సవాల్ అనిపించింది" అని చెప్పారు.

అప్‌డేట్స్

ఆ వాహనం కథేంటి?



హర్ష రోషన్, కార్తికేయ దేవ్, స్టీవెన్ మధు, సాన్వి మేఘన, నిహాల్ కోధాటి ముఖ్య తారలుగా సుప్రీత్ కృష్ణ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'టుక్ టుక్'. రాహుల్ రెడ్డి, లోక్కు శ్రీ వరుణ్, శ్రీరాముల రెడ్డి, సుప్రీత్ సి కృష్ణ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం మార్చి 21న విడుదల కానుంది. దీనికి సంబంధించిన పోస్టర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు సుప్రీత్ కృష్ణ మాట్లాడుతూ 'న్యూ ఏజ్ స్టోరీతో రూపొందుతున్న ఈ చిత్రంలో ప్రతి సన్నివేశం ప్రేక్షకులకు కొత్త అనుభూతిని పంచుతుంది. ఇందులో ఉండే స్కూటర్ కమ్ ఆటో ఎన్నో మ్యాజికల్ పవర్స్‌ను కలిగి ఉంటుంది. అందరూ ఆ వాహనం ప్రేమలో పడిపోతారు. యువతరానికి నచ్చే అంశాలతోపాటు కుటుంబ ప్రేక్షకులు మెచ్చే భావోద్వేగాలు ఈ చిత్రంలో ఉన్నాయి' అని తెలిపారు. నిర్మాతలు మాట్లాడుతూ 'కథలో ఆ స్కూటర్ కమ్ ఆటో పాత్ర ఏంటి అనేది సినిమాలో ఎంతో ఆసక్తికరంగా ఉంటుంది' అని చెప్పారు.

తెలుగు తెరకు కొత్త గ్లామర్



టాలీవుడ్ స్క్రీన్‌కు ఓ కొత్త గ్లామర్ యాడ్ కాబోతుంది. 'సర్కార్ నౌకరి ఫేమ్', గాయని సునీత తనయుడు ఆకాశ్ హీరోగా శివ దర్శకత్వంలో తథాస్తు క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మాత తాటి బాలకృష్ణ, నిర్మిస్తున్న చిత్రంలో భైరవి కథానాయికగా పరిచయం అవుతున్నారు. 'ఈ మూవీని విలేజ్ బ్యాక్ గ్రౌండ్‌లో నిర్మిస్తున్నాం. రొమాంటిక్ లవ్ సస్పెన్స్ కామెడీ చిత్రం ఇది' అని నిర్మాత తాటి బాలకృష్ణ తెలిపారు.

నేర పరిశోధన నేపథ్యంలో



నూతన నటీనటులతో సరికొత్త తరహాలో రూపొందుతున్న క్రైమ్ థ్రిల్లర్ 'అబ్సెషన్'. రాకేశ్ శ్రీపాద దర్శకత్వంలో రవి నాలమ్ నిర్మిస్తున్నారు. గురువారం కొరియోగ్రాఫర్ గణేశ్ మాస్టర్ చేతుల మీదుగా టైటిల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. హరీశ్ వినయ్, వి. ధీరజ్ ప్రధాన పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: అనీశ్ రాజ్ దేశ్‌ముఖ్, సినిమాటోగ్రఫీ: వనిధర్‌రెడ్డి

• **సంక్షేమం, అభివృద్ధి లక్ష్యం**

చింతమనేని ప్రభాకర్, దెందులూరు ఎమ్మెల్యే



కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టే బడ్జెట్ రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ఉంటుంది. ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాల హామీలను నెరవేర్చే దిశగా ఈసారి బడ్జెట్ ఉంటుందని భావిస్తున్నాం. దెందులూరు నియోజకవర్గం ఎన్నడూలేని విధంగా అభివృద్ధి సాధించే దిశగా ప్రతిపాదనలు చేశాం. ఆరునెలల కాలంలోనే నిజమైన అభివృద్ధిని ప్రజలు రుచిచూశారు. ఉపాధి కల్పన దిశగా రాష్ట్రం అడుగులు వేస్తోంది.

• **పంపిన ప్రతిపాదనలపై చర్చిస్తా**

బడేటి చంటి , ఏలూరు ఎమ్మెల్యే



పోలవరం ప్రాజెక్టుకు అధిక కేటాయింపులు ఉండే అవకాశం ఉంది. ఏలూరు నియోజకవర్గంలో శని వారపుపేటలోని కాజ్వేపై బ్రిడ్జి నిర్మాణానికి బడ్జెట్ కేటాయింపులపై ప్రతి పాదనలు పంపాం. టిడ్కో గృహాలు పూర్తిచేయడానికి,తమ్మిలేరు రిటైనింగ్‌వాల్ నిర్మాణం కోసం బడ్జెట్‌లో కేటాయింపులు చేయాలని కోరాం. మేము పంపిన ప్రతిపాదనలు బడ్జెట్ సమావేశాల్లో ప్రస్తావిస్తాం.

• **వంతెనల నిర్మాణానికి ప్రతిపాదనలు**

ధర్మరాజు, ఉంగుటూరు ఎమ్మెల్యే



నియోజకవర్గంలో రహదారులు, సాగునీరు, పరిశ్రమల ఏర్పాటుపై నిధులు కేటాయింపు ఉంటుందని భావిస్తున్నాం. వీటిపై అసెంబ్లీ దృష్టికి తీసుకువస్తాను. ఉంగుటూరు నియోజకవర్గంలోని బొబ్బిలి, నారాయణపురం వంతెన నిర్మాణం కోసం ప్రతిపాదనల పంపాం. నియోజకవర్గంలో ప్రధానంగా డ్రైన్ల నిర్మాణం తోపాటు ట్రాఫిక్ సమస్యల పరిష్కారం కోసం ప్రయత్నిస్తాను. నియోజకవర్గంలో ప్రభుత్వం అంద జేసిన స్థలాల్లో, సొంత స్థలాల్లో ఇళ్ల నిర్మాణం మంజూరుకు కృషి చేస్తా.

• **కొల్లేరు పర్యాటక అభివృద్ధిపై దృష్టి**

కామినేని శ్రీనివాస్, కైకలూరు ఎమ్మెల్యే



సాగు, తాగునీరు సరఫరాకు వేసవిలోని పంటకాలువుల, మురుగు కాలువల అభివృద్ధికి, ఆక్వారంగానికి అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తుందన్నారు. కొల్లేరును పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక నిధులను ప్రభుత్వం కేటాయిస్తుందని భావిస్తున్నా. ఇప్పటికే పలు అంశాలపై ప్రభుత్వానికి ప్రతి పాదనలు అందజేశాం. అవకాశాన్ని బట్టి పలు అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి ప్రజలకు మేలు జరిగేలా చూస్తాను.

నేడు అసెంబ్లీలో వార్షిక బడ్జెట్. ఈసారైనా ఉమ్మడి జిల్లాలో ప్రాధాన్యతా రంగాలకు కేటాయింపులు సంతృప్తికరంగా ఉంటాయన్న ఆశలేకపోలేదు. గత బడ్జెట్‌లో పోలవరం ప్రాజెక్టు, చింతలపూడి ఎత్తిపోతలు, కాలువల ఆధునికీకరణకు కొంతమేర నిధులు కేటాయించారు. ఈసారి వీటితోపాటు మరిన్ని విభాగాలకు కేటాయింపులు సంతృప్తికరంగా ఉండేలా జాగ్రత్త పడబోతున్నారనే ఆశ అందరిలోనూ ఉంది. సాగునీటితో పాటు తాగునీరు, మౌలిక సదుపాయాల కల్పన, వ్యవసాయం, అనుబంధ రంగాలు, పంటలకు బోనస్, ఊరటనిచ్చేలా ప్రోత్సాహకాలు, ఆక్వా రంగానికి చేయూత, కొల్లేరుకు మరింత ప్రాధాన్యం ఇచ్చేలా బడ్జెట్ ఉండబోతుందా అనేదే అందరిలోనూ ఉత్కంఠ.



నిండుగా నిధులిస్తారా..

అసెంబ్లీలో నేడు వార్షిక బడ్జెట్

అందరిచూపు.. ఆ దిశగానే

పోలవరంతోపాటు ఎత్తిపోతల కోసం ఎదురుచూపులు

ఆధునికీకరణ,కొల్లేరు రెగ్యులేటర్లపైనా ఆశలు


ఆక్వాను ఆదుకోండంటూ ఇప్పటికే డిమాండ్

ఎమ్మెల్యేలు ఇదే బాటలోనే..

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)


రాష్ట్ర వార్షిక బడ్జెట్‌లో ఈసారి మెరుపులు మెరిపిస్తారా, లేక నీరుగారుస్తారా అనే తర్జనభర్జన సాగుతోంది. అసెంబ్లీలో వార్షిక బడ్జెట్‌ను శుక్రవారం ప్రవేశ పెడుతున్నారు. ఇంతకు ముందు అనేక రంగాలు, వ్యవస్థలు కుప్పకూలిన స్థితిలో ఉండగా క్రమేపీ ఆయా రంగాలను తిరిగి పునర్నిర్మిస్తూ వస్తున్నారు.ఈ క్రమంలోనే ఈసారి వార్షిక బడ్జెట్‌లో అందరినీ సంతృప్తిపరిచేలా కేటాయింపులు ఉండబోతున్నాయని భావిస్తున్నారు. ప్రత్యేకించి పోలవరం ప్రాజెక్టును త్వరితగతిన నిర్మించేందుకు వీలుగా గత వార్షిక బడ్జెట్‌లో 4 వేల 873 కోట్లు కేటాయించారు. ఈ క్రమంలోనే పోలవరం ప్రాజెక్టు పనులు పుంజుకున్నాయి. ఇంకోవైపు పోలవరం నిర్వాసిత కుటుంబాలకు 900 కోట్లకుపైగా ఈ మధ్యనే సాయం అందించారు. గడిచిన ఐదేళ్లుగా నయాపైసా పైసా అందని స్థితిలో పోలవరం నిర్వాసిత కుటుంబాలు బావురమంటుండగా వారిని ఓదార్చేలా కూటమి ప్రభుత్వం నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోకే పరిహారం చేరేలా చూసింది. పోలవరం, కుక్కునూరు, వేలేరుపాడు వంటి మండలాల్లో ముంపు గ్రామాల్లో ఉన్న వారంతా ఈ చర్యతో కాస్త తేరుకోగలిగారు. ఈసారి రాష్ట్ర బడ్జెట్‌లో పోలవరం ప్రాజెక్టుకు భారీ కేటాయింపులు ఉంటాయని అంచనా వేస్తున్నారు. ఉమ్మడి పశ్చిమకు చెందిన పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు జల వనరుల మంత్రిగా ఉన్నారు.ఈ నేపథ్యంలో ప్రధాన సాగునీటి ప్రాజెక్టులతో పాటు మిగతా పథకాలకు తగినన్ని నిధులు లభిస్తాయన్న ఆశ, ఆతృత అందరిలోనూ కనిపిస్తున్నాయి.

ఎత్తిపోతలకు కాస్తంత ఎక్కువగానే..



పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయాలన్న తపనతో రాష్ట్ర ప్రభుత్వం ఉండగా దీంతోపాటు ప్రధాన ఎత్తిపోతల పథకాలను పూర్తి చేయబోతున్నట్టు ఇప్పటికే కూటమి ప్రభుత్వం ప్రకటించింది. చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని రెండు దశలుగా విభజించి పూర్తి చేయాలని భావిస్తున్నారు. ఈ క్రమంలోనే చింతలపూడి ఎత్తిపోతలకు గత వార్షిక బడ్జెట్‌లో 150 కోట్లు కేటాయించారు. అయితే అప్పట్లో ఇది ఏమాత్రం ఎత్తిపోతల పనులు చేపట్టడానికి సరిపోదని, కాంట్రాక్టు ఏజెన్సీలకు బకాయిలు చెల్లించడానికే సరి పోతుందన్న వ్యాఖ్యలు వినిపించాయి. దాదాపు 3 వేల 782 కోట్ల వ్యయంతో చింతలపూడి ఎత్తిపోతలను పూర్తిచేయా లంటే ఆ మేరకు ఈ ఏడాది ఆసాంతం తగినన్ని నిధులు కేటాయించాల్సిందే. ఈ వార్షిక బడ్జెట్‌లో చింతలపూడి ఎత్తిపోతల మొదటి దశకు మోక్షం లభించేలా చూస్తారని ఆశ అందరిలోనూ ఉంది. చింతలపూడి ఎమ్మెల్యే రోషన్‌కుమార్ సైతం ఈ ఎత్తిపోతలను పూర్తి చేయాలనే డిమాండ్‌తోనే ఉన్నారు. దీనికితోడు తాడిపూడి ఎత్తిపోతల పథకానికి తగినన్ని నిధులు కేటాయిస్తే దాదాపు రెండున్నర లక్షల ఎకరాలకు సాగునీరు సాఫీగా అందుతుంది. కేవలం పిల్ల కాలువలు నిర్మించేందుకు అవసరమైన నిధులు కేటాయించకపోవడం వల్లే ఇప్పటిదాకా పూర్తి స్థాయి లక్ష్యాలను అందుకోలేకపోతున్నారు.

ఆధునికీకరణకు ఆదుకుంటారా..



పంట కాలువలను ఆధునికీకరణకు 20 ఏళ్ల క్రితమే సరికొత్త కార్యాచరణ చేపట్టగా ఇప్పటిదాకా ఆ లక్ష్యాలను అందుకోలేక పోయారు. 2014-19 మధ్య అప్పటి టీడీపీ ప్రభుత్వం మాత్రం ప్రతీ వార్షిక బడ్జెట్‌లోను తగినన్ని నిధులు కేటాయిస్తూ వచ్చింది. కొంతమేర పనుల్లో పురోగతి సాధించగలిగింది. కానీ 2019-24 మధ్య వైసీపీ ప్రభుత్వం మాత్రం ఆధునికీకరణ పనులను విస్మరించింది. ఉభయగోదావరి జిల్లాల్లో గత వార్షిక బడ్జెట్‌లో కూటమి ప్రభుత్వం ఆధునికీకరణ పనుల సుమారు 50 కోట్లు కేటాయించింది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు వచ్చేసరికి 20 కోట్ల మేర కోటాగా నిర్ణయించారు. ఈసారి వార్షిక బడ్జెట్‌లో పనులు పూర్తి చేసేలా నిధులు కేటాయించాల్సిందేనని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

కొల్లేరు సంగతేంటి..



కొల్లేరు రెగ్యులేటర్ల నిర్మాణానికి వీలుగా గతంలోనే ప్రణాళిక రూపొందించారు. కానీ గత వార్షిక బడ్జెట్‌లో వీటి నిర్మాణానికి అనువుగా ఎలాంటి నిధులు కేటాయించలేదు. రెగ్యులేటర్ల నిర్మాణం కారణంగా ఒకవైపు కొల్లేరులోకి ఉప్పునీటి సాంద్రత చేరకుండా చూడడం, రెండోవైపు మత్స్యకార కుటుంబాల్లో సంప్రదాయ వేటకు అనుగుణంగా కొల్లేరును తీర్చిదిద్దడం వంటి అనేక లక్ష్యాలు ఉన్నాయి. ఈసారి వార్షిక బడ్జెట్‌లోనైనా రెగ్యులేటర్ల నిర్మాణానికి అనువుగా నిధులు కేటాయించాలని గట్టిగానే పట్టుపడుతున్నారు. దీని నిర్మాణ ఆవశ్యకతను ఇప్పటికే పదేపదే ప్రజాప్రతినిధులు బహిరంగ వేదికలపై చెబుతూ వచ్చారు. కూటమి ప్రభుత్వం ఈ మేరకు వార్షిక బడ్జెట్‌లో సరైన కేటాయింపులే చేస్తుందన్న ధీమాతో ఎమ్మెల్యేలు ఉన్నారు.

ఆక్వాకు ఊపిరి పోస్తారా ?

ఆక్వా రంగానికి ఊపిరి పోసే విధంగా బడ్జెట్‌లో తగినంత నిధులు కేటాయించకపోతారా అనే ఆశతోనే ఆక్వాను నమ్ముకున్న రైతులు ఉన్నారు. ఇప్పటికే వరుస వైరస్‌లు రైతులను దెబ్బ తీస్తుండగా మార్కెట్ ఒడిదుడుకులు వీరిని నష్టాల పాలుచేస్తూ వచ్చింది. గత వైసీపీ ప్రభుత్వం అనుసరించిన వైఖరి వల్ల ఆక్వా కోలుకోలేనంతగా దెబ్బతింది. దీంతో ఈసారైనా కూటమి ప్రభుత్వం ఆక్వాకు అవసరమైన విద్యుత్ అవసరాలతో పాటు మార్కెట్ సౌకర్యాలను మెరుగుపర్చాలన్న డిమాండ్ తెరమీదకు వచ్చింది.

ప్రాధాన్యతా రంగాలకు పెద్ద పీట !

ఈ వార్షిక బడ్జెట్‌లో ప్రాధాన్యతా రంగాలకు పెద్ద పీట వేస్తారని అందరూ భావిస్తున్నారు. దీనికనుగుణంగానే కేటాయింపులు ఉండబోతున్నాయని ఊహిస్తున్నారు. ఈ మేరకు అన్ని వర్గాలు కూటమి బడ్జెట్‌పైనే ఆశగా ఎదురుచూస్తున్నాయి. వ్యవసాయ రంగానికి ఊతమిచ్చేలా కేటాయింపులు ఉండాలని, డోనర్స్‌తో పాటు రైతులకు చెల్లించాల్సిన ప్రోత్సాహకాల్లో పెరుగుదల ఉండా లని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఉపాధి అవకాశాలు మెరుగుపడేలా సరికొత్తగా నిధులు కేటాయించాలన్న డిమాండ్ వినపడుతోంది.

• **ప్రతీ ఇంటికీ గోదావరి జలాలు**

పితాని సత్యనారాయణ, ఆచంట ఎమ్మెల్యే



ఆచంట నియోజకవర్గంలో ప్రతీ ఇంటికి కుళాయి ద్వారా గోదావరి జలాలను అందించేలా ప్రతిపాదనలు పంపాం. నియోజకవర్గంలో కొన్ని కాలనీలను పైలట్ ప్రాజెక్టులుగా తీసుకుని అన్ని మౌలిక సదుపాయాలు కల్పించనున్నాం. జిల్లా కోనసీమ జిల్లాను కలుపుతూ కోడేరు నుంచి గన్నవరం వరకు వారధి నిర్మించేందుకు గతంలోనే ప్రతిపాదనలు సిద్ధం చేశాం. 2027లో జరిగే గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని గోదావరి పరివాహక ప్రాంతాలను అతి సుందరంగా తీర్చిదిద్దడంతోపాటు పుష్కర ఘాట్‌లు, పలు ఆలయాల అభివృద్ధికి, ఏటిగట్లను పటిష్టం చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం.

• **ఆధునికీకరణ నిధులు కేటాయించాలి**

ఆరిమిల్లి రాధాకృష్ణ, తణుకు ఎమ్మెల్యే



బడ్జెట్ సమావేశంలో ప్రజల అభిమతం మేరకు సూపర్ సిక్స్ పథకాలకు కేటాయింపులు చేయాలి. తల్లికి వందనంతోపాటు, ప్రధానంగా మౌలిక సదుపాయాలు, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ రోడ్ల అభివృద్ధికి, తాగునీరు పూర్తి స్థాయిలో ప్రజలకు చేరువయ్యే జలజీవన్ మిషన్ నిధులు ప్రకటించాలి. డెల్టా ఆధునికీకరణ కోసం నిధులు కేటాయించాలి.

• **రహదారుల కోసం రూ.12 కోట్లతో ప్రతిపాదనలు**

బొలిశెట్టి శ్రీనివాస్, తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే



నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధి కోసం రూ.12 కోట్లకు ప్రతి పాదనలను పంపించాం. ఇప్పటికే పెంటపాడు మండలం బోడపాడు రహదారి కోసం రూ.1.60 కోట్లు మంజూరయ్యాయి. రూరల్ మండలం జగన్నాథపురం నుంచి మాధవరం వరకూ రూ.87 లక్షలు మంజూరయ్యాయి. బడ్జెట్ సమావేశాలను బట్టి నియోజకవర్గ అభివృద్ధి కోసం మరింత కృషి చేస్తాం.

• **నియోజకవర్గ సమస్యలపై చర్చిస్తా**

బొమ్మిడి నాయకర్, నరసాపురం ఎమ్మెల్యే



దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న హార్బర్, తాగునీటి సమస్య, ఆక్వా యూనివర్సిటీ పనుల వేగవంతం, వియర్ ఛానల్‌తదితర సమస్యలను సభ దృష్టికి తీసుకు వెళతా. వేసవి వస్తే తీర ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి ఎక్కువగా ఉంది. దీన్ని శాశ్వతంగా పరిష్కరిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చాం. పట్టణంలో పైప్‌లైన్లు మెరుగుపర్చాలి. కలుషిత నీటిని అరికట్టి స్వచ్ఛమైన నీరు అందిస్తామని హామీ ఇచ్చాం. దాన్ని సభ దృష్టికి తీసుకెళ్లి నిధులకు కృషి చేస్తా.



కొల్లేటికోట పెద్దింటమ్మ ఆలయం

రేపటి నుంచి కొల్లేరు పెద్దింటమ్మ జాతర

కైకలూరు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి):కొల్లేటికోట పెద్దింటమ్మ జాతరకు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఏటా ఫాల్గుణ శుద్ధ పాడ్యమి నుంచి పౌర్ణమి వరకు ఈ ఉత్సవాలు నిర్వహిస్తారు. మార్చి ఒకటో తేదీ నుంచి 13 వరకు జరుగుతాయి. 10న జలదుర్గమ్మకు గోకర్ణపురంలోని గోకర్ణేశ్వరస్వామికి కల్యాణ మహోత్సవం జరిపిస్తారు. చివరిరోజు 13న ఆలయ కోనేరు లో తెప్పోత్సవం జరుపుతారు. జాతర మహోత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఆలయ ఈవో కూచిపూడి శ్రీనివాస్ తెలిపారు. భక్తుల సౌకర్యార్థం జల్లు స్నానాలు, మంచినీరు, చలువ పందిర్లు, విద్యుద్దీపాలంకరణ, వైద్య శిబిరాలు ఏర్పాట్లు పూర్తిచేశారు. పెద్దింటమ్మ తొమ్మిదడుగులు ఎత్తు కలిగి విశాల నేత్రాలతో పద్మాసన భంగిమలో ఉన్న పార్వతీదేవీ ప్రతిరూపం. అమ్మవారిని ఇక్కడ మత్స్యకారులు కులదైవంగా కొలుస్తారు. వీరంతా పూర్వం ఒడిశా ప్రాంతం నుంచి వలస వచ్చి కొల్లేరు సరస్సు చుట్టూ స్థిరనివాసం ఏర్పరచుకున్నారు. ఇక్కడ వడ్డెర కులస్థులే కాకుండా అసోం, ఒడిశా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని పలు ప్రాంతాల నుంచి లక్షలాదిగా భక్తులు తరలివస్తారు.



కనుల పండువగా రామలింగేశ్వరస్వామి కల్యాణం

ముసునూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి):బలివే రామలింగేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం కనుల పండవగా నిర్వహించారు. రాజరాజేశ్వరి అమ్మవారిని పెండ్లి కుమార్తెగా, స్వామివారిని పెండ్లి కుమారుడిగా అలంకరించి మేళతాళాలు మంగళ వాయిద్యాల నడుమ కల్యాణ మండపానికి తీసుకువచ్చారు. బుధవారం రాత్రి 11.30 గంటలకు వేదమంత్రోచ్చరణలతో కల్యాణం నిర్వహించారు. అనంతరం తాతగుడికి ఊరేగింపుగా వెళ్లి స్వామివారు ఆశీస్సులు పొందారు. ఉత్సవాల్లో మూడో రోజు గురువారం కూడా భక్తుల రద్దీ కొనసాగింది. స్వామివారికి ఉదయం తీర్థబిందె, హోమం, బలిహరణ, సాయంత్రం హోమం, బలిహరణ, మహాకుంభం, రాత్రి 10 గంటల నుంచి పురవీధుల్లో స్వామివారి రథోత్సవం నిర్వహించారు.



రావణబ్రహ్మ వాహనంపై క్షీరారాముని ఊరేగింపు





రథంలో స్వామివారు...రథోత్సవంలో భక్తజన సందోహం

శోభాయమానం.. సోమేశ్వరుని రథోత్సవం

భీమవరం టౌన్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : గునుపూడి సోమేశ్వరస్వామి రథోత్సవం శోభాయమానంగా సాగింది. గురువారం తెల్లవారుజామున పార్వతీ పరమేశ్వరులకు వైభవంగా కల్యాణం నిర్వహించిన అనంతరం సాయంత్రం రథోత్సవం నిర్వహించారు. భక్తులు మొక్కులుగా కట్టిన అరటిపండ్ల గెలలతో ముస్తాబైన రథంపై క్షేత్రపాలకుడైన జనార్ధనస్వామి వెంటరాగా కల్యాణ మూర్తులైన పార్వతీ పరమేశ్వరులను మేళతాళాలతో ఊరేగారు. ఆలయ అర్చకులు చెరుకూరి రామకృష్ణ, కందుకూరి సోంబాబు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు కొబ్బరి కాయ కొట్టారు. ప్రత్యేక హరతులు ఇచ్చిన అనంతరం భక్తులు ఒకసారిగా శివ నామ స్మరణ చేస్తు రథాన్ని లాగారు. అక్కడ నుంచి ఎటువంటి ఆటంకాలు లేకుండా నాచువారి సెంటర్ వరకు దాదాపు 2 గంటలపాటు రథో త్సవం సాగింది. డీఎస్పీ జయసూర్య ఆధ్వర్యంలో వన్‌టౌన్ సీఐ పర్యవేక్షణలో బందోబస్తు ఏర్పాటు చేసారు. ఎండోమెంట్ ఇన్ స్పెక్టర్ వెంకటేశ్వరరావు, ఈవో రామకృష్ణరాజు పర్యవేక్షించారు.

ఊరేగింపులో అపశ్రుతి

సోమేశ్వరస్వామి ఆలయం వద్ద గురువారం మధ్యాహ్నం అపశ్రుతి చోటు చేసుకుంది కల్యాణోత్సవం కోసం వేసిన తాటాకు పందిరి అంటుకోవడంతో మంటలు చెలరేగాయి. అక్కడ ఉన్న ప్రజలు పోలీసులు, ఫైర్ సిబ్బంది అప్రమత్తం అవడంతో మంటలను వెంటనే అదుపులోకి తెచ్చారు. రథోత్సవం సందర్భంగా బాణాసంచా కాల్చారు. ఒక జువ్వ గాలిగోపురం వద్ద ఉన్న తాటాకు పందిరిపై పడడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. దీంతో రథోత్సవం సాగుతున్నంత సేపు బాణసంచా కాల్చడం నిలిపివేశారు.



బాణసంచా పండి అంటుకున్న తాటాకు పందిరి

రావణబ్రహ్మ వాహనంలో ఊరేగిన క్షీరా రామలింగేశ్వరస్వామి

పాలకొల్లు అర్బన్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి):: మహా శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా క్షీరా రామ లింగేశ్వరస్వామి, పార్వతీ అమ్మవార్లను గురువారం సాయంత్రం రావణాబ్రహ్మ వాహనంపై ఊరేగించారు. బుధవారం అర్ధరాత్రి లింగోద్భవ కాలంలో దగ్గులూరుకు చెందిన వరదా సోమేశ్వరరావు, రామకోటి దంపతులు నేసిన 18 అడుగుల వెడల్పు, 360 మూరల పొడవు కలిగిన మల్లన్నపాగాను స్వామివారి ఆలయ శిఖరం నుంచి గాలి గోపురానికి ప్రత్యేకంగా అలంకరించారు. ఈవిధంగా శ్రీశైలం లోనూ, పాలకొల్లు క్షీరా రామలింగేశ్వర స్వామివార్ల ఆలయాల్లో మాత్రమే ప్రత్యేకంగా అలంకరించే ఆచారం ఉంది. గురువారం స్వామివారికి అభిషేకాలు, పూజలు, అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు.గ్రామోత్సవానికి ముందు కుంభం పోశారు.

బలివే తమ్మిలేరులో మరొకరి మృతి



రాంబాబు (ఫైల్)

ముసునూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): బలివే రామలింగేశ్వరస్వామి స్నానఘట్టం దగ్గర ఇద్దరు అన్నదమ్ములు మృతి చెందిన విషయం మరువక ముందే గురువారం మరొకరు మృతి చెందారు. ముసునూరు మండలం అక్కి రెడ్డిగూడెంకు చెందిన హెచ్చు రాంబాబు (28) స్వామివారి దర్శనం అనంతరం సాయంత్రం తమ్మిలేరులో స్నానానికి దిగి నీటిలో మునిగిపోయాడు. స్థానికులు స్పందించి అతడికి వెలికితీయగా అప్పటికే మృతిచెందాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నూజివీడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు. తమ్మిలేరులో ప్రమాదాలు జరుగకుండా రక్షణగా కర్రలను ఏర్పాటు చేసి, హెచ్చరిక బోర్డులు ఉంచాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేసినా సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహించారని పలువురు మండిపడుతున్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

భీమవరం క్రైం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : భీమవరం ఉండి రోడ్డులో ఉన్న ఒక ఆసుపత్రిలో మెడికల్ షాపులో పనిచేస్తున్న యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. టూటౌన్ సీఐ కాళీచరణ్ తెలిపిన వివరాల ప్రకారం తూర్పు గోదావరి జిల్లా గోపాలపురానికి చెందిన ఖండవల్లి శ్రీనివాసరావు (28) మూడేళ్లుగా ఆసుపత్రిలో మెడికల్ షాపులో పని చేస్తున్నాడు. గురువారం ఉదయం ఆకస్మాత్తుగా కళ్ళు తిరిగి పడిపోవడంతో వైద్యులు పరీక్షించారు. అప్పటికే మృతి చెందినట్లుగా నిర్ధారించారు. అయితే మృతుడు శ్రీనివాసరావు సోదరుడైన ఖండవల్లి శివదుర్గారావు మాత్రం వైద్యుల నిర్లక్ష్యం వల్లే తన సోదరుడు మృతి చెందాడని అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. శ్రీనివాసరావు ఆపరేషన్ చేసే ముందు ఇచ్చే మత్తు ఇంజెక్షన్ వాడాడని అది డోస్ ఎక్కువ అవడం వల్ల మృతి చెందాడా లేక మరేదైనా కారణమా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చెరువులో కూరుకుపోయిన మృతదేహాలు లభ్యం



ఏలూరు క్రైం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : చెరువులోని ఊబిలో మునిగి పోయిన బాబాయి, అబ్బాయి మృతదేహాలు గురువారం ఉదయం తేలడంతో రెస్క్యూటీమ్ వాటిని బయటకు తీశారు. ఏలూరు సమీపంలోని వట్లూరుకు చెందిన జిజ్జువరపు వెంకటేశ్వరరావు (50) ఈనెల 26వ తేదీ సాయంత్రం ఆ గ్రామంలోని చెరువులో స్నానం చేయడానికి దిగగా ఊబిలో కూరుకుపోతూ కేకలు వేయడంతో అతని తమ్ముడి కుమారుడు సుబ్రహ్మణ్యం (30) కాపా డేందుకు నీటిలో దిగాడు. ఇతను కూడా ఊబిలో కూరుకుపోతూ కేకలు వేశాడు. అయితే గట్టుపై ఉన్నవారు భయంతో కాపాడలేకపోయారు.పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది బుధవారం సాయంత్రం వరకు గాలింపు చేపట్టినా మృత దేహాలు లభ్యం కాలేదు. గురువారం ఉదయం రెండు మృతదేహాలు నీటిలో తేలడంతో రెస్క్యూ టీమ్ బయటకు తీసుకువచ్చారు. ఏలూరు త్రీటౌన్ సీఐ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి మృతదేహాలను ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి పోస్టుమార్టం చేసి బంధువులకు అప్పగించారు.

డయాలసిస్ బాధ తట్టుకోలేక ఆత్మహత్య

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి):డయాలసిస్ బాధను తట్టుకోలేని ఓ వ్యక్తి ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తిరుమలంపాలెంకు చెందిన భీమడోలు నాగేశ్వరరావు(62) ఏడాది కాలంగా మూత్రపిండాల సమస్యతో బాధపడు తూ డయాలసిస్ చేయించు కుంటున్నాడు. డయా లసిస్‌ను తట్టుకోలేక ఈ నెల 25న పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. తీవ్రంగా గాయపడిన అతడిని ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి అక్కడి నుంచి విజయవాడ తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాలకొల్లు టౌన్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : పాలకొల్లు పట్టణ పరిధిలో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈఈ కె. మధుసూదనరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 33 /11 కెవీ ఫీడర్ మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా పదిదాం రోడ్డు, మెయిన్ రోడ్డు, శంభునిపేట, పెద్ద గోపురం, పోస్టాఫీసు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

నేటితో ఈకేవైసీ గడువు ముగింపు

అత్తిలి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం నమోదుకు సంబంధించి ఈకేవైసీ ఈనెల 28తో ముగుస్తుందని మండల వ్యవసాయాధికారి టి రాజేష్ తెలిపారు. ఇంకా ఈకేవైసీ చేయించుకోవాల్సిన వారు రైతు భరోసా కేంద్ర ఇన్‌ఛార్జి వద్ద నమోదు చేయించుకోవాలని తెలిపారు. ఈకేవైసీ చేయించుకున్న రైతులకు మాత్రమే ధాన్యం అమ్ముటకు, పంట నష్టపరిహారం, సున్నా వడ్డీ, పంటల బీమా వర్తిస్తుందని తెలిపారు.


ఆచంటలో బారులు తీరిన ఓటర్లు


అత్తిలిలో జేసీ పరిశీలన


కాళ్లలో ఆర్డీవో ప్రవీణ్ కుమార్ రెడ్డి పరిశీలన


గణపవరంలో పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లు


గణపవరంలో గన్ని, కూటమి నేతలు

ఎమ్మెల్సీ పోలింగ్ ప్రశాంతం


మొగల్తూరులో ఎమ్మెల్యే నాయకర్, కొత్తపల్లి తదితరులు

నరసాపురం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక గురువారం పట్టణంలో ప్రశాంతంగా జరిగింది. మొత్తం ఆరు పోలింగ్ కేంద్రాల్లో 5475 మంది ఓటర్లు ఉండగా 3694 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 67.47శాతం పోలింగ్ నమోదైనట్టు అధికారులు తెలిపారు. ఉదయం మందకొడిగా సాగిన పోలింగ్ 12గంటల నుంచి స్పీడ్ అయింది. చివర గంటలో చాల మంది ఓటు వేసేందుకు కేంద్రాల వద్దకు తరలివచ్చారు. వీరందరికీ క్యూపన్లు ఇచ్చి 6 గంటల వరకు ఓట్లు వేయించారు. ప్రభుత్వ మైనార్టీ సంక్షేమ సహాదారు షరీఫ్, మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు, ఉమ్మడి ఏపీ ఎస్టీవో సంఘం రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి పాలంకి సుబ్బరాయన్ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

మొగల్తూరు: మండలంలో 1745 మంది ఓటర్లకు గాను 1187 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 68.2 శాతం పోలింగ్ నమోదైనట్టు తహసీల్దార్ కె.రాజ్ కిషోర్ తెలిపారు. ఆర్డీవో దాసిరాజు, డీఎస్పీ శ్రీవేద, ట్రైనీ డీఎస్పీ మానస, తహసీల్దార్ కె.రాజ్ కిషోర్, పోలీస్ సిబ్బంది పర్యవేక్షణ చేశారు.

పాలకొల్లు అర్బన్: పాలకొల్లులో 7,957 మంది ఓటర్లకు గాను 5,710 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోగా 71.76 శాతం ఓటింగ్ నమోదు అయినట్టు ఎన్నికల అధికారి, తహసీల్దార్ పై దుర్గా కిషోర్ తెలిపారు. పట్టణంలో మూడు కేంద్రాల్లో 10 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. ఎంఎంకెఎన్ఎం హైస్కూల్లో మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు ఓటు హక్కు వినియోగించుకున్నారు. అనంతరం బూత్ వద్ద ఎన్నికల సరళిని పరిశీలించారు. అలాగే మాజీ ఎమ్మెల్యే అంగర రామమోహన్ ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోటీలో ఉన్న కూటమి అభ్యర్థి రాజశేఖరం బూత్‌ల వద్ద ఎన్నికల సరళిని పరిశీలించారు. పోటీలో 35 మంది ఉండటంతో ఓటు వేయడంలో వృద్ధులు ఇబ్బంది పడ్డారు.

యలమంచిలి: మండలంలో మొత్తం 2722 ఓటర్లకుగానూ 2033 మంది ఓటర్లు ఓటుహక్కును వినియోగించుకున్నారు. 74.69 శాతం పోలింగ్ నమోదైనట్టు తహసీల్దార్ జి.పవన్‌కుమార్ తెలిపారు. మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు పోలింగ్ సరళిని పరిశీలించారు. ఎన్నికల అధికారులకు తగు సూచనలు చేశారు. నరసాపురం ఆర్డీవో దాసిరాజు పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ సరళిని పరిశీలించారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన పలువురు ఓటర్లకు ఒక ప్రధాన పార్టీకి చెందిన మద్దతుదారులు ప్రయాణచార్జీలను ఇవ్వడం గమనార్హం.

పెనుగొండ: మండలంలో 2529 ఓట్లకు గాను 1822 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలం మొత్తం మీద 72.22 పోలింగ్ శాతం నమోదైనట్టు తహసీల్దార్ జి. అనిత కుమారి తెలిపారు. వడలి గ్రామంలో ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ పర్యటించి కూటమి నేతలను ఓటింగ్ సరళిని అడిగి తెలుసుకున్నారు.

పెనుమంట్ర: ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సరళిని జిల్లా జాయింట్ కలెక్టర్ టి. రాహుల్‌కుమార్‌రెడ్డి పర్యవేక్షించారు. తహసీల్దార్ వై. రవి కుమార్‌కు పలు సూచనలిచ్చారు. పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని అడిషనల్ ఎస్పీ భీమారావు ఎస్ఐ స్వామి ని ఆదేశించారు. మెడికల్ క్యాంప్‌ను పరిశీలించారు. పెనుమంట్ర మండలంలో 72.57 శాతం ఓట్లు పోలయ్యాయని మండల తహసీల్దార్ వైరవి కుమార్ తెలిపారు. మూడు పోలింగ్‌స్టేషన్‌ల సంబంధించి 2133 ఓటర్లుండగా 1548 మంది ఓటు హక్కు వినియోగించుకున్నట్టు చెప్పారు.

ఆచంట: మండలం మొత్తం మీద 70.59 పోలింగ్ శాతం నమోదు అయ్యింది. తహసీల్దార్ జి. కనకరాజు పర్యవేక్షించారు. పోలింగ్ సరళిని ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ కూటమి నేతలను అడిగి తెలుసుకున్నారు.

పోడూరు: పోడూరులోని మూడు పోలింగ్ బూత్‌లలో ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహించారు. మొత్తం ఓటర్లు 2363 ఉండగా 1694 ఓట్లు పోలయ్యాయి. 71.69 శాతం పోలింగ్ నమోదైంది. పోలింగ్ బూత్‌లను నరసాపురం ఆర్డీవో దాసి రాజు పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ ఎస్ఎం ఫాజిల్, ఆర్ఐ రాంబాబు ఉన్నారు.

తణుకు: పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాల వద్ద పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటింగ్ సాయంత్రానికి 72.3 శాతం నమోదైంది. పట్టణంలో 12 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. 8 వేల 542 మంది ఓటర్లకుగాను 6 వేల 176 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆయా పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ డీవీఎస్ఎస్ అశోక్ వర్మ, మున్సిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్ పరిశీలించారు.

ఇరగవరం: మండలంలో 3 పోలింగ్ కేంద్రాల్లో 1978 ఓట్లకు గాను 1480 పోలయ్యాయని, ఓటింగ్ శాతం 74.75 నమోదైనట్టు తహసీల్దార్ సుందరరాజు అన్నారు. పోలింగ్ కేంద్రాలను ఆర్డీవో ఖతీబ్ కౌసర్ బానో పరిశీలించారు. ఏఎస్పీ భీమారావు భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు.

అత్తిలి: మండలంలో 3 పోలింగ్ బూత్‌లలో మొత్తం 2267 మంది ఓటర్లు ఉండగా 1753 మంది ఓటు వేశారు. 70 శాతం పోలింగ్ నమోదైంది. తాడేపల్లిగూడెం ఆర్డీవో కతీఫ్ కౌసర్ బాను, ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, తహసీల్దార్ దశిక వంశీ ఓటింగ్ సరళిని పరిశీలించారు. ఎమ్మెల్సీ ఆర్. గోపిమూర్తి కూడా అత్తిలిలో పోలింగ్ సరళిని పరిశీలించారు. జేసీ టి రాహుల్‌కుమార్‌రెడ్డి పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసి మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల నుంచి బ్యాలెట్ బాక్సులను పోలీస్ బందోబస్తుతో పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టరేట్ భీమవరం రిసెప్షన్ సెంటర్‌కు తరలిస్తామన్నారు.

తాడేపల్లిగూడెం రూరల్: పట్టణంలో తాడేపల్లిగూడెం జడ్పీ హైస్కూల్, సుబ్బారావు పేట మున్సిపల్ హైస్కూల్, ఈవీఎం స్కూల్‌లోని 10 పోలింగ్ కేంద్రాల్లో 6381 ఓటర్లకు గాను పోలింగ్ ముగిసే సమయానికి 66.96 శాతం ఓట్లు నమోదైనట్టు తహసీల్దార్ ఎం సునీల్‌కుమార్ తెలిపారు. ఎన్నికల సరళిని ఎమ్మెల్యే బొలిశెట్టి, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వలవల బాబ్జి, బీజేపీ కన్వీనర్ ఈతకోట తాతాజీ, కూటమి నాయకులు పరిశీలించారు.

పెంటపాడు: మండలంలో మొత్తం 1863 మంది ఓటర్లుండగా 1352 మంది ఓటు హక్కును వినియోగించుకున్నట్టు 72.06 పోలింగ్ శాతం నమోదైనట్టు ఇన్‌చార్జి తహసీల్దార్ సీతారత్నం తెలిపారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.

భీమవరం టౌన్: భీమవరం, వీరవాసరంలోని మొత్తం 4 పోలింగ్ కేంద్రాల్లో 12,897 మంది ఓటర్లకు గాను 8,375 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటింగ్ శాతం 64.94గా నమోదైనట్టు అధికారులు తెలిపా రు.

ఉండి: ఉండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగింది. మండలంలో 1532ఓట్లుగా గాను 1059 ఓట్లు పోలయ్యాయి. 69.12శాతం పోలింగ్ నమోదైనట్టు తహసీల్దారు కె.నాగార్జున తెలిపారు.

కాళ్ళ: కాళ్ళ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (మెయిన్)లో ఏర్పాటు చేసిన రెండు పోలింగ్ బూత్‌లలో 1465 మంది ఓటర్లకుగాను 1028 మంది పట్టభద్రులు ఓటు హక్కును వినియోగించుకున్నట్లు తహసీల్దార్ జి.సుందర్ సింగ్ తెలిపారు. 70.17 శాతం ఓటింగ్ జరిగినట్లు ఆయన స్పష్టం చేశారు. భీమవరం ఆర్డీవో ప్రవీణ్ కుమార్ రెడ్డి ఎన్నికల ఓటింగ్ సరళిని పరిశీలించారు.

పాలకోడేరు: మండలంలో మొత్తం ఓట్లు 2374 ఉండగా 1578 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 66.47 శాతం పోలింగ్ నమోదైనట్టు అసిస్టెంట్ ఆర్‌వో విజయలక్ష్మి తెలిపారు. పాలకోడేరులోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జరుగుతున్న పోలింగ్ సరళిని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజు పర్యవేక్షించారు.

ఆకివీడు: స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మూడు పోలింగ్ బూత్‌ల్లో ఓటర్లు ఓటును వినియోగించుకున్నారు. మండలంలో మొత్తం 2046 పట్టభద్రులు ఓట్లు ఉండగా 1535 ఓటు పోలయ్యాయి. పోలింగ్ శాతం 74గా నమోదైనట్టు తహసీల్దార్ నండూరి వెంకటేశ్వరరావు తెలిపారు. కాగా స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల పోలింగ్ బూత్‌లో గురువారం డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆయన వెంట కూటమి నేతలు మోటుపల్లి రామవర ప్రసాద్, బొల్లా వెంకట్రావు, గంధం ఉమా, నౌకట్ల రామారావు, పిల్లా బాబులు, కోరా రామ్మూర్తి, కట్రెడ్డి ఏడుకొండలు, రామరాజు, జాకీర్, అబ్జల్, నాగమణి, ఆరీఫ్ తదితరులు ఉన్నారు. ఏపీ లీగల్ సర్వీస్ అథారిటీ డిప్యూటీ సెక్రటరీ డాక్టర్ అమరలింగేశ్వరరావు విజయవాడ నుంచి వచ్చి తమ ఓటును వినియోగించుకున్నారు.

గణపవరం: గణపవరంలో ఏర్పాటు చేసిన మూడు పోలింగ్ కేంద్రాల్లో 1877మంది ఓటర్లకుగానూ 1290 ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 68.70 శాతం ఓట్లు పోలైనట్టు అధికారులు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, ఏలూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, బీజేపీ ఉంగుటూరు నియోజకవర్గ కన్వీనర్ శరణాల మాలతీరాణి, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్లు ఇందుకూరి రామకృష్ణంరాజు, పొత్తూరి వాసురాజు ఓటింగ్ సరళిని పరిశీలించారు.


అధికారులకు మంత్రి నిమ్మల సూచనలు





ఓటు హక్కు వినియోగించుకున్న అంగర, షరీఫ్, బండారు, పాలంకి సుబ్బరాయన్


ఆకివీడులో ఓటు వేసేందుకు దివ్యాంగుడిని చేతులపై తీసుకు వస్తున్న దృశ్యం

మన ఆరోగ్య పరిరక్షణ మన చేతుల్లోనే..

భీమవరం అర్బన్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ కారకమైన ప్లాస్టిక్‌ను నిషేధించడం మనందరి కర్తవ్యమని మార్నింగ్ కాఫీ క్లబ్ కన్వీనర్ బొండా రాంబాబు, కో-కన్వీనర్ ఓలేటి శ్రీనివాస్, పీఆర్‌వో భట్టిప్రోలు శ్రీనివాస రావు, కోట్ల నాని అన్నారు. శ్రీ విజ్ఞాన వేదిక, భీమవరం పురపాలక సంఘం ఆధ్వర్యంలో శ్రీరాంపురం రోడ్డులోని తాడిమళ్ళ వారి కాంప్లెక్స్ వద్ద ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించి దేవీ జ్యూయలర్స్ అధినేత కోట్ల నాని సహకారంతో 100 గుడ్డ సంచులను ఉచితంగా అందించారు.

2న దివ్యాంగుల క్రికెట్ క్రీడాకారుల ఎంపిక

భీమవరం అర్బన్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగుల జిల్లా క్రికెట్ క్రీడాకారుల ఎంపికను మార్చి 2వ తేదీ ఏలూరు సీఆర్ రెడ్డి కాలేజీలో నిర్వహిస్తున్నట్లు ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి సానా సతీష్ బాబు గురువారం ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం జారీ చేసిన సదరం సర్టిఫికెట్ లేనివారి అనర్హులన్నారు. మరిన్ని వివరాలకు 90141 44440, 95420 79799 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఏఎస్ఆర్‌లో ముగిసిన క్రీడా పోటీలు

పెంటపాడు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మూడు రోజులుగా ప్రత్తిపాడు ఏఎస్ఆర్ హోమియోపతి కళాశాలలో జరుగుతున్న ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ పరిధిలోని అంతర కళాశాలల క్రీడా పోటీలు ముగిశాయి. ఎన్టీఆర్ విశ్వవిద్యాలయ స్పోర్ట్స్ బోర్డ్ కార్యదర్శి ఇ.త్రిమూర్తి, ఏఎస్ఆర్ కళాశాల ప్రిన్సిపల్, స్పోర్ట్స్ చైర్మన్ యూఎస్‌వీ ప్రసాద్ ఆధ్వర్యంలో విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.



గవర ఆత్మీయ సమావేశం

అత్తిలి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): అత్తిలి మండలం లక్ష్మీనారాయణపురంలో జరిగిన గవర ఆత్మీయ సమావేశంలో గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ళ సురేంద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడు గవర సామాజిక వర్గానికి రాజకీయంగా ప్రాధాన్యత ఇస్తున్నారని, అందులో భాగంగా లక్ష్మీనారాయణపురంలో పొలమరశెట్టి నాగేశ్వరరావుకి గవర కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమించారని తెలిపారు. సంఘం జిల్లా అధ్యక్షులు మళ్ళ రాంబాబు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సురేంద్రను సన్మానించారు.

బీజేపీ జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవికి సత్కారం

తణుకు రూరల్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా అధ్యక్షురాలిగా ఎన్నికైన తణుకు బాబా స్టూడియో అధినేత్రి ఐనంపూడి శ్రీదేవిని జిల్లా ఫొటోగ్రాఫర్స్ కలర్ ల్యాబ్స్, మిక్సింగ్ యూనిట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాల సంఘ సభ్యులు సత్కరించారు. గురువారం పైడిపర్రులో నిర్వహించిన శ్రీదేవి అభినందన కార్యక్రమంలో రాష్ట్ర చైర్మన్ మాదాల రమేష్, రాష్ట్ర కోశాధికారి చిలంకుర్తి శేషు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఉమ్మడి జిల్లాల చైర్మన్ మరడాని రాము, జిల్లా గౌరవ అధ్యక్షులు పి. శ్యామ్‌బాబ తదితరులు పాల్గొన్నారు.

'రూట్స్'లో మెగా సైన్సు డే

తణుకు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): రూట్స్ స్కూల్ ఆఫ్ ఎసెన్షియల్ ఫ్యాకల్టీస్‌లో గురువారం మెగా సైన్సు డే నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఎల్.కె.త్రిపాఠి మాట్లాడుతూ నీటి ప్రాధాన్యత, గ్లోబల్ వార్మింగ్, ఏఐ, రోబోటిక్స్ రాకెట్ లాంచింగ్, రోడ్డు ప్రమా దాలు అరికట్టే విధంగా అలారమ్స్ వంటి అనేక కొత్త ఆలోచనలకు విద్యార్థులు శ్రీకారం చుట్టినట్లు వివరించారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

తణుకు రూరల్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీని వెంటనే చేపట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు కోరారు. గురువారం వేల్పూరులో సీపీఐ, రాష్ట్ర మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, అర్హులైన పేదలతో ప్రభుత్వానికి అర్జీలను పూరించే కార్యక్రమం చేపట్టారు. ఏపీ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సికిలే పుష్పకుమారి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బొలిశెట్టి, బాబ్జి, తాతాజీ

రాజశేఖరానిదే గెలుపు : కూటమి ధీమా

తాడేపల్లిగూడెం అర్బన్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీగా కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం భారీ మెజా ర్టీతో గెలుస్తారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ఆశాభావం వ్యక్తం చేశారు. బుధవారం పట్టణంలోని ఎమ్మెల్సీ ఎన్నికలను పరిశీలించిన ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రాజశేఖరం గెలుపు కోసం కూటమి శ్రేణులంతా కలసి కట్టుగా పనిచేశామన్నారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి, బీజేపీ కన్వీనర్ ఈతకోట తాతాజీ పాల్గొన్నారు.

భీమవరం అర్బన్: పట్టభద్రుల ఎన్నికల సందర్భంగా భీమవరం నియోజకవర్గంలోని ఎన్నికల శిబిరాల వద్ద కుటమి నాయకులు సందడి చేశారు. గురువారం ఉదయం పట్టణంలోని పోలింగ్ కేంద్రాల వద్ద పోలింగ్ సరళిని అడిగితెలుసుకున్నారు. ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, టీడీపీ జిల్లా అధ్యక్షులు మంతెన రామరాజు, రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి, రాష్ట్ర నాయకులు మెరగాని నారాయణమ్మ, పార్థసారథి, కోళ్ళ నాగేశ్వరరావు, వేంద్ర శ్రీనివాస్ జనసేన జిల్లా కార్యదర్శి చెనమల చంద్రశేఖర్ కుటమి నాయకులు ఆయా పట్టభద్రుల ఓటు హక్కును వినియోగించుకోవడం పై ఆరా తీసారు. మొదటి ప్రాధాన్యత ఓటు రాజశేఖరానికి వేసేలా చూడాలని కార్యకర్తలకు సూచించారు.


భీమవరంలో పోలింగ్ కేంద్రం వద్ద కూటమి నాయకులు

పెనుమంట్ర: గురువారం ఎమ్మెల్సీ ఎన్నికలు పురస్కరించుకుని ఆచంట నియోజకవర్గంలోని పెనుమంట్ర, పెనుగొండ, పోడూరు, ఆచంట మండలాల్లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ విస్తృతంగా పర్యటించారు. కూటమి నాయకులను దిశా నిర్దేశం చేశారు. ఆచంట నియోజకవర్గ టీడీపీ పరిశీలకులు రుద్రరాజు రామరాజు, బీజేపీ ఆచంట నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రసాదరెడ్డి, జనసేన మండల అధ్యక్షుడు కోయా కార్తీక్, టీడీపీ మండల అధ్యక్షుడు కేతా మీరయ్య జడ్పీటీసీ ఉప్పలపాటి సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

తణుకు: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి బలపర్చిన రాజశేఖరం గెలుపు ఖాయమని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. గురువారం ఎమ్మెల్సీ ఎన్నికల ఓటింగ్ సందర్భంగా స్థానిక బాలికోన్నత పాఠశాలలో ఎమ్మెల్యే ఆరిమిల్లి దంపతులు తమ ఓటు హక్కును వినియోగించుకుని మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పనితీరు పట్ల ప్రజలు సానుకూలంగా ఉన్నారని, ఉపాధ్యాయులు, విద్యావంతులు పేరాబత్తులను గెలిపించుకుంటామని చెప్పారన్నారు. బాలికల ఉన్నత పాఠశాల ప్రాంగణంలోని పోలింగ్ కేంద్రాలకు సంబంధించి కూటమి ఏజెంట్లు, నాయకులతో ఓటింగ్ సరళిని టీడీపీ జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజు విచ్చేసి అడిగి తెలుసుకున్నారు.

ఉండి: ఉభయగోదావరి జిల్లాలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికలలో రాజశేఖరందే విజయమని రాష్ట్ర టీడీపీ కార్యనిర్వహణ కార్యదర్శి పొత్తూరి వెంకటేశ్వరరాజు, జనసేన ఉండి ఇన్‌చార్జు జుత్తుగ నాగరాజు, నరసాపురం పార్లమెంటు బిజెపి కన్వీనరు పేరిచర్ల సుభాష్‌రాజు, టీడీపీ మండల అధ్యక్షుడు కరిమెరక నాగరాజు తదితరులు ధీమా వ్యక్తం చేశారు. గురువారం ఉండిలో పోలింగ్ ముగిసిన తదుపరి వారు మాట్లాడారు.

అన్న క్యాంటీన్ తనిఖీ

నరసాపురం టౌన్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అన్న క్యాంటీన్‌ను గురువారం కమిషనర్ అంజయ్య ఆకస్మిక తనిఖీ చేశారు. క్యాంటీన్‌లో ఎంత మందికి అల్పాహారం, భోజనాలు వడ్డిస్తు న్నారు.. పరిశుభ్రత తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలిచ్చారు. కమిషనర్ వెంట సిబ్బంది పాల్గొన్నారు.

శారీ ప్రింటింగ్‌లో ఉచిత శిక్షణ

పాలకొల్లు అర్బన్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక డీఎన్ఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మహిళలకు మార్చి 3, 4 తేదీలలో చీరల మీద డిజైన్లు ప్రింటింగ్‌పై ఉచిత శిక్షణ ఇస్తున్నట్టు నిర్వాహకులు జ్యోతి టీచర్ ఒక ప్రకటనలో తెలిపారు. పాలకొల్లు పరిసర ప్రాంతాల్లోని మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఇతర వివరాలకు 98660 83729లో సంప్రదించాల ని తెలిపారు.

అవగాహన సదస్సు

నరసాపురం రూరల్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం ఇంజనీరింగ్ విద్యలో కోర్ గ్రూప్‌లైన మెకానికల్, ఈసీఈ విభాగాల ఆవశ్యకతలపై అవగాహన సదస్సు నిర్వహించారు. దీనికి టెక్ మహేంద్ర కంపెనీ ఇంజనీరింగ్ విభాగ అధిపతి వివేకానంద విచ్చేశారు. కోర్ గ్రూప్‌లు చదవడం వల్ల విద్య, ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. చైర్మన్ సత్యనారాయణ, కోశాధికారి త్రినాథ్, డైరెక్టర్ శ్రీహరి, ప్రిన్సిపాల్ సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు సహకరించాలి

ఆకివీడు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ అభివృద్ధికి ప్రజలు సహకరించాలని కమిషనర్ కృష్ణమోహన్ అన్నారు. గురువారం తెల్లవారుజామున పలు వార్డులలో పారిశుధ్య పనులను పరిశీలించి మాట్లాడారు. నగర పంచాయతీ పంపించే ట్రాక్టర్లు, రిక్షాలలో చెత్తను వేయాలన్నారు. డ్రైన్లలో వేయడం వల్ల పూడుకుపోయి దుర్వాసన రావడంతో దోమలు పెరుగుతాయన్నారు.

ఒకరికి కుక్కకాటు

యలమంచిలి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): కొంతేరు గ్రామం అంబటివారి వీధికి చెందిన వలవల నాగేశ్వరరావును గురువారం కుక్క కరవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. తాపీ మేస్త్రిగా పనిచేస్తున్న నాగేశ్వరరావు గురువారం పనికివెళ్లి మధ్యాహ్నం భోజనానికి ఇంటి కి వచ్చి మోటారుసైకిల్ స్టాండు వేస్తుం డగా కుక్క తీవ్రంగా గాయపరిచింది. స్థాని కులు అతనిని పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు అతనికి అవసరమైన ఇంజక్షన్ చేశారు.

పటిష్ఠ బందోబస్తు

పోలింగ్ కేంద్రాలు పరిశీలించిన ఎస్పీ

భీమవరం క్రైం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రులు స్వేచ్ఛగా ఓటుహక్కును వినియోగించుకునేందుకు పటిష్ఠమైన భద్రతా చర్యలు తీసుకున్నామని జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి తెలిపారు. జిల్లాలో వివిధ పోలింగ్ కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్యూలైన్లు, ఎన్నికల తీరును, భద్రతా చర్యలను పర్యవేక్షించారు. ప్రతి ఒక్కరిని క్షుణ్ణంగా తనిఖీ చేసి పోలింగ్ కేంద్రంలోకి పంపాలని, ఎలక్ట్రానిక్ పరికరాలు, నిషేధిత వస్తువులు అనుమతించవద్దని విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించి అధిక సంఖ్యలో పోలీసు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆయన వెంట భీమవరం డీఎస్పీ ఆర్. జయసూర్య, జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వి.పుల్లారావు తదితరులు పాల్గొన్నారు. , సంబంధిత పరిధిలోని పోలీస్ స్టేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


దుప్పట్లు పంచుతున్న కాకరాల వేణుబాబు

ఉండి లయన్స్ క్లబ్ సేవలు భేష్

ఉండి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఉండి లయన్స్‌క్లబ్ కార్యక్రమాలు అభినందనీయమని లయన్స్ జిల్లా గవర్నరు కాకరాల వేణుబాబు అన్నారు. గురువారం ఉండిలో లయన్స్ అధ్యక్షుడు సత్తి బ్రహ్మారెడ్డి అధ్యక్షతన పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పేదలకు దుప్పట్లు, ఉండి జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు పౌష్టికాహారం నిమిత్తం రూ. 15వేలు, సన్‌రైజ్ వృద్ధాశ్రమం కోసం రూ. 10 వేలు లయన్స్ అందించడం అభినందనీయమని వేణుబాబు అభినందించారు. ముదునూరి శివరామరాజు, రుద్రరాజు నరసరాజు, కన్నెగంటి రూత్‌కళ, వేగేశ్న అనంతలక్ష్మి, గాదిరాజు రంగరాజు తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అనుమానాస్పద మృతి

నరసాపురం రూరల్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొప్పర్రు పెద్దపేటకు చెందిన గోడి కరుణకుమారి (25) అనే వివాహిత గురువారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు రూరల్ సీఐ దుర్గా ప్రసాద్ చెప్పారు. ఆమెకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. భర్త ఉపాధి నిమిత్తం గల్ఫ్‌లో ఉంటున్నాడు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ చెప్పారు.

గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి

పెనుగొండ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): దేవలో దొంగ రావిపాలెం నుంచి దేవకు ఉపాధి పనులు చేయడానికి వచ్చిన పిల్లి లక్ష్మి (55) గుండెపోటుతో మృతి చెందింది. పనులు చేస్తుండగా ఒక్కసారిగా కుప్పకూలిపోవడంతో పెనుగొండలో ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆమె మృతిచెందింది. ఉపాధి కూలీ మృతికి ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ సంతాపం తెలిపారు. ఆమె కుటుంబానికి అండగా ఉంటానని ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలు అందేలా చూస్తానని అన్నారు.

వైభవంగా ప్రభల సంబరం...

పెనుగొండ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): సిద్ధాంతంలో భద్రకాళి సమేత శ్రీ వీరభద్ర స్వామి ఆలయంలో ప్రభల సంబరం బుధవారం రాత్రి వేడుకగా నిర్వహించారు. శూలాల నృత్యం, సన్నాయి మేళాలతో ఐశెట్టి సుబ్రహ్మణ్యం దంపతులచే వీరభద్రస్వామి ప్రభకు విబూది తాంబూలం కట్టి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఖండవల్లి వారి కూచిపూడి జానపద నృత్య ప్రదర్శన, భక్తుల్ని విశేషంగా ఆకర్షించింది.

రామాలయ పునఃప్రతిష్ఠ ఉత్సవాలు

ఉండి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిలుకూరులో శ్రీకోదండరామాలయం పునఃప్రతిష్ఠ కార్యక్రమం శుక్రవారం నుంచి మార్చి 2వ తేదీ వరకు వైభవంగా నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ వేగేశ్న సత్యనారాయణరాజు వెల్లడించారు. మార్చి 2వ తేదీ ఉదయం 11.19 నిమిషాలకు ప్రారంభించనున్నారు. అనంతరం అన్నసమారాధన జరగనుంది. ఆలయ నిర్మాణానికి దాతలు పెన్మెత్స భీమరాజు, ముదునూరి సోమరాజు (సర్పంచ్), ముదునూరి సీతారామరాజు, వేగేశ్న గోపాలరాజు, వేగేశ్న దిలీప్‌రాజు తదితరులు సహకారించారని చైర్మన్ వెల్లడించారు. భక్తులంతా కార్యక్రమంలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

ఆధ్యాత్మికం

వైభవంగా భీమేశ్వర స్వామి రథోత్సవం

భీమవరం టౌన్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : భీమేశ్వర స్వామి రథోత్సవం వైభవంగా జరిగింది. ప్రత్యేకంగా పూలతో అలంకరించిన రథంపై స్వామి వారు ఊరేగారు. ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు కొబ్బరికాయ కొట్టి రథోత్సవాన్ని ప్రారంభించారు. ఉమ్మడి జిల్లా జనసేన అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు (చినబాబు) ఆలయ ఈఓ తోట శ్రీనివాసరావు, కారుమురి సత్యనారాయణమూర్తి, మంతెన రామచంద్రరాజు, చెన్నమల చంద్రశేఖర్, కోళ్ళ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అన్నసమారాధనకు పోటెత్తిన భక్తులు

ఆచంట: ప్రసిద్ధ ఆచంటేశ్వరుని మహాశివరాత్రి కల్యాణోత్సవాలు వేడుకగా జరుగుతున్నాయి. గురువారం స్వామి వారికి నంది, సింహ వాహనం పై గ్రామోత్సవం నిర్వహించారు. అలాగే ఆలయ సత్రం వద్ద అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న అన్నసమారాధనలో వేలాది మంది వేల మంది భక్తులు పాల్గొన్నారు. ప్రతి ఏటా ఐదు రోజులు పాటు అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో అన్నసమారాదన నిర్వహించడం ఆనవాయితీ.

గణపవరం: గణపవరంలో సువర్ణేశ్వరస్వామి ఆలయంలో మూడు దశాబ్దాలుగా భారీ అన్నసమారాధనను నిర్వహిస్తున్న ఆధ్యాత్మికవేత్త సాగిరాజు సుబ్బరాజు ఈ ఏడాది కూడా భారీ అన్నసమారాధన నిర్వహించారు. గణపవరం పరిసర 30 గ్రామాల నుంచి భక్తులు పాల్గొన్నారు. సుబ్బరాజు ఆయన కుమారుడు సాయి రాజు, లయన్స్‌క్లబ్ మాజీ గవర్నర్ ఇందుకూరి ప్రసాద రాజు, అఖిల భారత హ్యాండ్‌లూమ్ బోర్డు మాజీ డైరెక్టర్ నంద్యాల రామలింగరాజు తదితరులు పర్యవేక్షించారు.